Eenadu

01-05/07/17.

# మెట్రో పనులకు మరో 17 నెలలు

- 2012లో మొదలైన ప్రాజెక్టు
- అయిదేళ్లలో పూర్తి చేస్తామని ఒప్పందం
- పలుచోట్ల ఆస్తుల సేకరణలో జాప్యంతో పూర్తి కాని వైనం
- 2018 నవంబరు వరకు గడువు పెంచుతూ సర్కారు నిర్ణయం



ఈనాడు - హైదరాబాద్

ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణ పనుల పూర్తికి తెలంగాణ ప్రభుత్వం గడువు పెంచింది. అయిదేళ్లలో పనులు పూర్తి చేయాలనే పూర్వ ఒప్పందం గడువు మంగళవారం ముగియడంతో.. తాజా గడువును 2018 నవంబరు వరకు పొడిగించింది. ఒలిఫెంటా బ్రిడ్జి (ఇప్లీబన్?) నుంచి మియాపూర్ 5 కి.మీ., హైటెక్‌సిటీ నుంచి రాయదుర్గం కిలోమీటరు దూరం మినహా మిగతా 66.56 కిలోమీటర్ల దూరాన్ని పొడిగించిన గడువులోపు పూర్తిచేయాలన్నది తాజా ఒప్పందం. నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ మెట్రోరైలు హైదరాబాద్ లిమిటెడ్, స్వతంత్ర ఇంజినీరు లూయిస్ బెర్జర్, హెచ్ఎంఆర్ఎల్ సమర్పించిన సాంకేతిక వివరాలను పరిశీలించిన అనంతరం.. ప్రభుత్వ సీనియర్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధుల పలు దఫాల సంప్రదింపులు జరిపాక ప్రభుత్వం గడువు పొడిగించినట్లు హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. మెట్రో మార్గాల్లో ఆస్తుల సేకరణలో కోర్టు కేసులు తదితర కారణాలతో ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం నెలకొందని ఆయన పేర్కొన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మరో 17 నెలలు పనుల పూర్తికి గడువు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పూర్తయిన మార్గాలను కొద్ది నెలల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎల్ అండ్‌టీ మెట్రో రైలు హైదరాబాద్ ఎండీ, హెచ్ఎంఆర్ఎల్ ఎండీలను ఆదేశించింది. మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్ 29 కి.మీ., నాగోల్ నుంచి హైటెక్‌సిటీ 27కి.మీ. మార్గాన్ని ఈ సంవత్సరాంతానికి పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పనుల పూర్తికి అడ్డంకిగా ఉన్న ఆస్తుల సేకరణను వేగవంతం చేయాలని సోమవారం జరిగిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మిగిలిన ఆస్తుల సేకరణ మెట్రో ప్రాజెక్టు పరిధిలోకి రాదని ఆయన స్పష్టం చేశారు.

- 2012 ఏప్రిల్... మెట్రో పనులు ప్రారంభం
  2012 జులై 5 అపాయింటెడ్ డేట్ (ఇక్కడి నుంచి ఐదేళ్లలో పనులు పూర్తి చేయాలనే ఒప్పందం )
- 2017 జులై 4 ప్రాజెక్టు పూర్తిచేయాల్సిన గడువు
- 2018 నవంబరు 17 నెలల గడువు పొడిగింపు

**ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్య ప్రాజెక్టు**

- 72 కి.మీ.. ప్రపంచంలో అతిపెద్ద పీపీపీ
  66.56 కి.మీ. ప్రస్తుతం జరుగుతున్న పనులు
- 86 శాతం పనులు పూర్తి
- రూ.14,132 కోట్లు ప్రాజెక్టు వ్యయం
- రూ. 12,674 కోట్లు ఎల్‌అండ్‌టీ మెట్రో చేసే వ్యయం
- రూ.3000 కోట్లు ఆస్తుల సేకరణకు తెలంగాణ ప్రభుత్వం చేసిన వ్యయం
- రూ. 1458 కేంద్రం ఇచ్చే సర్దుబాటు వ్యయ నిధి